("ఆంధ్రప్రభ"వీక్లీ; ఫిబ్రవరి 1972)

బ్రేక్ డౌన్

పావుగంట అయిపోయింది, కారాగిపోయి.

డ్రైవరు కనకయ్య ఇంజనుని కిందా మీదా పరిశీలించి చూసేడు. అన్నీ బాగానే ఉన్నాయి. కాని, డెల్కో-పాయింట్స్ కాలిపోయాయి.

కనకయ్యకి కారు తోలడంలో ఇరవయ్యేళ్ళ అనుభవంవుంది. ఇలాగే కారెన్నిమాట్లో ఆగిపోయింది. కాని, ఇలా ఇంత నిస్సహాయంగా ఎన్నడూ ఆగిపోలేదు. ఇంతలా తన శక్తికి మించిన దగా ఎన్నడూ జరగలేదు. కలెక్టర్లు మారారు. కార్లు మారాయి. తను మాత్రం ఎప్పుడూ ఇంతలా దొరికిపోలేదు. కారుని సాకల్యంగా పరీక్షిస్తూ గోడు అంతా దఫేదారు సింహాచలంలో వెళ్ళబోసుకున్నాడు.

కలెక్టర్ గోపాల్ కారు వెనుక సీటులో కూర్చుని రెవిన్యూబోర్డు మెంబరుకీ, ఎలెక్ట్రిసిటీ బోర్డు ఛెయిర్మన్‌కీ మధ్య జరిగిన అతి ముఖ్యమైన చర్చల సారాంశం కాగితాలమీద చూస్తున్నాడు. కారు బ్రేక్ డౌన్ అయింది. కాని, కనకయ్యకి బ్రేక్‌డౌన్ లేదని అతని నమ్మకం. అందుచేత అతని ఆలోచనకు ఏ అడ్డూ రాలేదు.

పని మానేసి కనకయ్య కారు దగ్గిరకొచ్చి నిలబడేసరికి అతనికి అనుమానం వేసింది. కనకయ్య కళ్ళల్లోకి సూటిగా చూసేడు. ఆ చూపులో "ఇంకా అవలేదూ? శుద్ధమొద్దు మొహం" అన్న అధికార పూర్వకమైన గద్దింపు మొదలు; "అప్పుడే అయిపోయిందా! థాంక్స్!" అన్న మెప్పు మాటలూ వున్నాయి. అసలేమీ అర్థం కాకుండా చూడ్డం కలెక్టర్లకి బాగా తెలుస్తుంది. అలాంటి కలెక్టర్లలో గోపాల్ అగ్రగణ్యుడు. అందుకనే ఎలక్ట్రిసిటీ బోర్డు ఛేర్మన్ పెద్దపెద్ద ఇంజనీర్లతో సీలేరులో ఏర్పాటుచేసిన ఆ ఉన్నత శ్రేణి సమావేశానికి రెవెన్యూ మెంబరు వస్తానని ప్రకటించీ కూడా తాను అనివార్య కారణాలవల్ల రాలేకపోతున్నాననీ, తన బదులు కలెక్టర్ శ్రీ గోపాల్ ఆ సమావేశంలో పాల్గొంటా

రనీ. చివరి నిమిషంలో తెలియజేసి, తాను రావడానికి ఇష్టం లేదనో, అవసరం లేదనో తెలియకుండా చేసేడు.

"కారు చెడిపోయింది, బాబూ!"

కాగితాలు చూడ్డం అయిపోయిందన్న ధోరణిలో విపిరికొట్టి "అసలే. జరిగింది?" అన్నాడు కలెక్టర్ గోపాల్ కారుదిగి రోడ్డుమీద అడుగుపెడుతూ

"డెలోక్రపాయింట్స్ కాలిపోయాయి, బాబూ."

"బయయిదేరేటప్పుడు చూసుకోనక్కర్లేదా?"

కనకయ్య బయలుదేరేటప్పుడు తా నన్నీ జాగ్రత్తగానే చూసుకున్న సంగతి చాలా వినయంతో చెప్పుకున్నాడు. అంతటితో ఆగకుండా ఇలాంటి ప్రమాదం జరగటం ఎప్పుడో గాని జరగదని, కావాలంటే చూడండని బోనెట్ ఎత్తి విషయం అంతా వివరంగా చెప్పేడు.

"వర్క్‌షాపు కెళ్తేగాని పని జరగదండి. తోసుకెళ్ళడం కానిపని. మెకానిక్కుని సామాన్లూ గట్రా పట్రమ్మని చెప్పి కబురు తోలెయ్యొచ్చండి" అన్నాడు కనకయ్య.

సీలేరువదిలి పదిహేను మైళ్ళయినా వచ్చేసి ఉంటారు.

రోడ్డుకి ఓవేపు ఎత్తుగా కొండ. రెండోవేపు అగాధంలా లోయ.ఆ లోయ లోతులు తెలిసి కళ్ళు తిరిగి జెంగెట్టుకోకుండా పొదలు. ఇంకా కిందికి పెద్దపెద్ద టేకి చెట్లు.

దూరంగా నేలా నింగీ కలిసేచోట నీలపు జాడ.ఎత్తుగా కొండమీద ఉండ టంవల్ల అ నీలపు జాడ మరీ దూరంగా తోస్తూంది. లెక్కల్లో సూత్రం జ్ఞాపకం వచ్చింది గోపాల్‌కి.... డిస్టెన్స్ టు ది అపరెంట్ హొరైజన్.

"కారు బాగయ్యే మార్గంగాని, త్వరగా ప్రయాణం సాగే సూత్రంగాని ఏదీ లేదూ?"

"లేదు, అన్ని బస్సులూ వెళ్ళిపోయాయి. ఆఖరి బస్సు సీలేర్లో బయలు దేరినాకనే కారు బయలుదేరింది. బస్సుని దాటేస్తాం మూణ్నిమిషాలలో అన్న దాకా వచ్చింది. ఆగిపోయి కూర్చుంది కారు. ప్రాజెక్టుకి సామానులు తెచ్చేవాళ్ళు తెల్లారితేగాని బయలుదేరరు. కార్లు ఆ దారిని వచ్చే అవకాశం కనబడదు___ కొండ అందాలు చూడ్డానికి వచ్చే కార్లు రావాలి తప్ప. డ్రైవరు కనకయ్యకీ, దఫేదారు సింహాచలానికి కూడా కాళ్ళు విరిచేసినట్టున్న మాటనిజమే. ఏ కారో,

జీపో తగలకపోతుందా. కనీసం వెళ్ళి చింతపల్లిలో పడకపోతామా అని వాళ్ళకి ధీమాగా నేవుంది. కానయితే కలెక్టరు బాబు మాట? ఆ దారంట ఏ కారో, జీపో రావాలేగాని వస్తే కలెక్టరుగారికి 'లిఫ్టు' ఇస్తారు, అందుకు సందేహంలేదు. ఆ మాటకొస్తే ఆ అడవి చూసి చేతులడ్డం పెడితే ఎవరడ్డం పెట్టినా ఆపుతారు,ఎవరయినా ఆపుతారు.

"నిలబడిపోయారు, బాబూ" అని డ్రైవరు కారు వెనకతలుపు తెరవబోయాడు.

"లేదులే. లోపల ఉక్కగా ఉంటుంది."

తనకేమో కాళ్ళూ చేతులూ చల్లగా అయిపోయాయి. అందులోనూ సాయంత్రం నడి మధ్యాహ్నం అప్పుడు కూడా చెట్టు నీడలో చలేసినట్టుంటుంది ఆ కొండల మీద. మరి అటువంటిది కలెక్టరు బాబుకి ఉక్కగా ఉండటం ఏమిటి? అవును, మరి! వారు బంగళాల్లో, ఆఫీసులో ఎయిర్ కూలర్ల దగ్గిర కూచునేవారు. మరి ఉక్కగా ఉండదా?

నాలుగడుగులు వేసి కాస్త ముందుకి వచ్చాడు గోపాల్. ఎలక్ట్రిక్ టవర్ లైన్ నడినెత్తి మీదుగా దూరదూరాలకు పోతూంది. తలెత్తి చూశాడు. అతని వెనక నడుస్తున్న సింహాచలం కూడా తలెత్తి చూశాడు అలవాటుగా.

"ఈ ఎలక్ట్రిక్ టవర్ లైన్స్ మీద అక్కడక్కడ టెలిఫోన్స్ ఉంటాయనుకుంటాను. కదూ?"

"అవును బాబూ, సప్పర్ల కాడుంది. కాని, పదిమైళ్ళు ఇక్కడికి" అన్నాడు సింహాచలం.

"అక్కడికి నడిచెళ్ళి ఫోన్ చెయ్యడాని కెంతసేపు పడుతుంది?"

డ్రైవరుకూడా వచ్చాడు అక్కడికి.

"మేమిద్దరం ఎళితే తమ రొక్కరూ ఇక్కడుండలేరండి" అన్నాడు డ్రైవరు.

"ఇద్దరూ ఎందుకూ? సింహాచలం వెళతాడు."

"ఈ సందపొద్దుని రోడ్డుమీద ఒక్కరూ ఎళ్ళలేరండి. మంచిదికాదు— జంతువూ గట్రా వచ్చినా చేసినా...."

"అదా.... పోనీ, ఇద్దరూ వెళ్ళండి. కార్లో కూర్చుంటాను. నాకేం భయంలేదు."

"బయట నిలబడ్డమే రైటండి. ఏదైనా కారో లారీయో వస్తే ఆపు జెయ్యచ్చు."

"ఊరుకుందూ నువ్వు మరీనూ— దొరగారొక్కరూ నిలబడితే ఎవ్వడికి తెలుస్తాది?"

అదీ నిజమేననిపించింది గోపాల్‌కి. వాళ్ళులేని సమయంలో ఏదేనా కారు రావచ్చు. చెయ్యి చూపించి కారు ఆపచ్చు, కాని, నేనీజిల్లా కలెక్టర్ని. నర్సీపట్నమో, చింతపల్లో లిఫ్ట్ ఇవ్వండి అని తనంత వాడు అభ్యర్థించడం కష్టాల్లో కెల్లా కష్టం. కార్లుగల తరగతిలో సగం మంది ఇలాంటి కష్టాల్ని నమ్మడం కష్టం, ఆదుకోవడం అంతకన్నా కష్టం.

ఏదో వస్తున్న చప్పుడు వినిపించింది దడదడా, సీలేరువేపు నించే! మాట్లాడకన్నట్టు చూశాడు కలెక్టరు చెవులకి పదును పెట్టి ఆలోచిస్తూ.

"ఆఁ— లారీ వస్తోంది" అన్నాడు కనకయ్య.

"బస్సేమో?" అన్నాడు సింహాచలం.

"చూడు" అని చూపించేడు కనకయ్య.

ఘాట్ రోడ్డుమీద, కిందినించి, ఎగుబోటు పోటుకి ఎగశ్వాసల పొగలు కక్కుకుంటూ, ఆక్రోశించకుంటూ వస్తూందొక లారీ. ముందుగా పొగ తరువాత దానికి ముందుగా లారీ, కనపడేటంత దట్టంగా పొగవిడుస్తోందది. రోడ్డువంపులు కంటికైతే కనపడుతున్నాయి గాని, ఆ లారీ ఈ రెండు ఫర్లాంగుల రోడ్డు ఎక్కి వచ్చేసరికి రెండు నిమిషాలైనా పట్టేలాగుంది.

కనకయ్యా, సింహాచలం రోడ్డు కడ్డంగా నిలబడి చేతులు ఊపేరు.

దవాలావేసుకున్న తెల్లయూనిఫారమ్ బంట్రోతు, దవాలా వేసుకోకుండా కాకీ యూనిఫారమ్‌లో డ్రైవరూ, అల్లంతదూరాన బిస్కట్ కలర్ సూట్లో రాజఠీవితో అధికారీ కనపడగానే నిట్టూర్పులు విడుస్తున్న లారీ నీరసంగా నిలబడి పోయింది. కంగారు పడకుండా ధీమాగా నడుచుకుంటూ సింహాచలం లారీ దగ్గరి కెళ్లాడు.

"కలట్రుగారు" అన్నాడు పిడికిలి బిగించి, బొటనవేలితో చూపిస్తూ.

లారీ డ్రైవరు వెంటనే బండి దిగి, "దండాలు బాబయ్యా!" అన్నాడు.

బొట్టికాయ. నిండా పద్దెనిమిదేళ్ళు ఉండవు.... కలెక్టర్ గోపాల్ చెయ్యి ఆడించాడు.

"బండెక్కడిదాకా?" అనడిగాడు కనకయ్య.

"మా బండండీ?" అని కంగారు పడ్డాడు లారీ అబ్బాయి. "దారకొండ మలుపుకాడ లోవలోని పేకు కఱ్ఱ కొడతన్నారండి. అక్కడ నైటాల్డయి పోతాది."

చింతపల్లి దాకా మన కార్ని 'టో' చేసుకురమ్మను. దాల్లో ఎక్కడైనా లిఫ్టు దొరికితే అక్కడ విడిచి పెట్టేద్దాం, లేకపోతే చింతపల్లిలో వదిలేద్దాం" అన్నాడు కలెక్టర్ గోపాల్, డఫేదారు సింహాచలంతో.

'విన్నావుగా, కలెక్టర్‌గారి ఆర్డర్?' అన్నట్టు చూసి తల ఆడించాడు సింహాచలం.

లారీ డ్రైవరబ్బాయి రెండు చేతులూ ఎత్తి కలెక్టర్‌కి దండం పెట్టాడు. తల అడ్డంగా ఆడించాడు. "గాటీ రోడ్డుమీద అంతలక్క ఎల్దానికి బండికి దమ్ము నేదండి. పదిమైళ్ళే గదాని నాకు బండప్పగించేడండి డయివోరు."

"అంటే వీడు డ్రైవరు కాడా?"

జవాబు లేదు.

"మరి అసలు డ్రైవరు ఎక్కడున్నాడు?"

"సప్పర్లలో తాగేసి తొంగున్నాడండాడు. పెబువులు తప్పు కాయాల. నాకు నైసెన్సు నేదండి."

లారీ ఇంజన్, దాని తాత్కాలిక చోదకుడి గుండెలా లబలబలాడుతూనే ఉంది. ఆ శబ్దం కటువుగానే ఉంది. వాడి భాషలో యాసకన్నా, వాడిమాటలో నిస్పృహాయకకన్నా కటువుగా వినిపిస్తూంది ఆ చప్పుడు గోపాల్‌కి.

"నువ్వు లారీని డ్రైవ్ చెయ్యరాదూ?" అన్నాడు కనకయ్యతో.

"నేనా?.... నాకు రాదండి.... అసలే డిసోలో బండి, అందులో గాటీ రోడ్డు. ఒకదానికొకటి—— వద్దుబాబూ" అన్నాడు కనకయ్య.

అరనిమిషం అలా నిశ్శబ్దంగా నిలబడ్డాడు కలెక్టర్.

"వాణ్ణి పోనివ్వండి"

మళ్ళీ ఈ అవకాశం తప్పిపోతుందేమో నన్నట్లుగా లారీ కుఱ్ఱాడు తిరిగి తిరిగి దండాలు పెట్టుకుంటూ ఛంగున లారిలో కెక్కిపోయాడు. గేరు మార్చి లారీడు నిట్టూర్పు విడిచాడు. ఆ నిట్టూర్పు రొద తగ్గేసరికి నిమిషం పట్టింది. ఆ నిమిషంలోనే ఈ రాత్రికి మీకు మిగిలేది ఈ నల్లని పొగలాంటి చీకటేనర్రా అని ఏదో చిక్కని భయం కొండంతా వ్యాపించింది.

"ఆ లారీతో దారకొండ గుడికాడి కెళిపోయి ఉండాల్సింది" అన్నాడు సింహాచలం డ్రైవర్‌కి మాత్రం వినపడేటట్టు.

'ఇంకో గంట పాటు ఏ బండీగాని రాకపోతే అప్పుడా పాట్లు ఎలాగూ పడాలి, అనుకున్నాడు కనకయ్య తనలో తాను.

వాచీ చూసుకున్నాడు కలెక్టర్ గోపాల్.

ఐదూ ఇరవై.

ం ం ం

వాచీ చూసుకున్నాడు కలెక్టర్ గోపాల్.

ఆరుంపావు.

దూరంగా ఎర్రని ఆకాశంలో అస్తమిస్తూన్న సూర్యుడు కాంతి తరిగి, "వెంటనే ఆర్డర్స్ వేసే వీలులేని" కలెక్టర్‌లా ఉన్నాడు. ఆ ఎర్రని బింబాన్ని ఇంత ఎత్తునుంచి చూడడం తననుంచి తానే వేరయిపోయి ఒక ఎత్తులోంచి తనలోకి తాను చూడడంలో ఉంది.

దఫేదారు సింహాచలం రోడ్డుమీద బాసింపట్టు వేసుకుని కూర్చున్నాడు. పొదచాటు నుంచి అప్పుడే బయటపడుతున్న డ్రైవరు కనకయ్య నోట్లోంచి బయట పడుతున్న పొగ కనపడింది, వీళ్ళిద్దరూ వంతుల వారీగా పావుగంట కోసారి పొదలోకి వెళ్ళి రావడం పొగలోకి వెళ్ళి రావడానికన్నమాట!

తలుపు క్లిక్‌మనిపించాడు కలెక్టర్ గోపాల్,

డ్రైవరు కనకయ్య పరుగెత్తుకు వచ్చాడు. దఫేదారు సింహాచలం నింపాదిగా బాసింపట్టు విప్పుకుని నడిచి వస్తున్నాడు.

"ఊఁ(....." అన్నారు గోపాల్.

"సార్?"

"మనం ఇక్కడిలా నైట్ హాల్టేనా ఏమిటోయ్?"

"చిత్తం. మరి బండేదీ రాలేదు గదండి?"

"ఏం మనుషులోయ్ మీరు — వెధవ మొహాలు! బయలుదేరేప్పుడు అన్నీ చూసుకుని ఏడవరు— ఎక్కడ దొరికారో...." అని విసుక్కున్నాడేగాని కలెక్టర్ గోపాల్‌కి తను చేసిన తప్పులాంటిదొక చిన్న విషయం జ్ఞాపకం వచ్చింది.

తాను సీలేరు కాన్ఫరెన్సుకి వెళుతున్నాడని చింతపల్లి తాసిల్దారుకి

మొన్ననే తెలుసు. సీలేరు చింతపల్లి తాలూకాలోనిది. నిన్న ఉదయం నాలుగు గంటలకి తాను విశాఖపట్నంలో బయలుదేరాడు. చింతపల్లి చేరేసరికి ఏడున్నర అయింది, అక్కడ బంగళాలో తాసిల్దారు; దొరగారి బ్రేక్‌ఫాస్ట్ కి తగిన ఏర్పాట్లన్నీ చేసేడు. అతని తాలూకాలో కాంప్ కదా. అతనూ రావాలని సిద్ధపడ్డాడు. అతని దగ్గర "లాండ్ రెవెన్యూ డ్రైవ్ కోసమని, ఎక్కణ్ణుంచో తెచ్చి ఎలాట్ చేసిన ఒక జీపువుంది, "కలెక్టరుగారు కాంప్ క్లర్కైనా లేకుండా బయలుదేరుతున్నారు. ఆ జీప్ తీసుకుని నేనూ కలెక్టర్‌గారి కూడా వస్తాను" అని ఆఫర్ చేశాడు.

"నీ తాలూకాలో పరిపాలన ఎలాఉందో నేను చూడ్డానికొచ్చినప్పుడు వద్దూగాని నా వెంట. ప్రస్తుతం లాండ్ రెవెన్యూ వసూళ్ళు చూడు" అని అతణ్ణి కలెక్టరే ఆపేశాడు. అతను మంచివాడే, పాపం. కాని.ఎందుకో అతని మొహం చూస్తే తొందరగా వెళ్ళిపోవాలనిపిస్తుంది. ఆకారణంగా చికాకు.అతనూ ఆజీపూ ఉంటే నాకారు కతణ్ణి ఇక్కడ కాపలా పెట్టేసి నేను టింగురంగా అని విశాఖపట్నం వెళ్ళిపోయి ఉండేవాణ్ణి, అనుకున్నాడు. కలెక్టర్ గోపాల్.

"ఇక్కడ ఎట్లానోయ్?"

"చిత్తం!"

"ఇక్కడ ఎట్లానోయ్ అంటుంటే చిత్తం ఏమిటి నీమొహం? నేనొక్కణ్ణే కారు వెనక సీట్లో పడుకుంటే మీరిద్దరూ రోడ్డు మీద పడుకుంటారా? జంతువులున్నాయన్నావే జంతువులు– అవి మిమ్మల్నెత్తుకుపోవూ?"

"ఆయి! నిజమేనండి — ఇందమ్మటి ఏయన్నా గుడిసెలున్నాయ్యేమో సూస్తాను బాబూ" అన్నాడు సింహాచలం.

"ఇంకో గంటుండి బయలుదేరు— అవతల చీకటడిపోతోంది కనపట్టంలే? ఇంకెప్పుడు చూస్తావు?"

"మరేనండి....ఇందాక ఆ లారీతో దారకొండ గుడికాడదాకా పోతే తీరిపోనండి" అని అందుకున్నాడు డ్రైవరు.

"గుడీ? ఏం గుడీ?"

"గుడేనండి. దారాలమ్మ గుడంటారండి. అక్కడ ఒకరిద్దరు మనుసులు రాత్రికి ఆట్టు చెయ్యొచ్చున్నార్—బాగుంటాది."

"ఇక్కడి కెంత దూరం?"

"రెండుమైళ్ళుంటుందేమో, సార్?"

"ఏమో ఏమిటి. కరెక్టుగా తెలీదా?"

"తెలీస్సార్" అన్నాడు డ్రైవరు పరమ వినయంగా. 'కరెక్టుగా నాకు మాత్రం ఎలా తెలుస్తుంది? నేనూ మీలాగే కారుల్లో తిరిగే వోణ్ణేగదా'! అనుకున్నాడు లోపల.

o o o

కలెక్టర్ గోపాల్ ఈ జిల్లాకి వచ్చి రెండేళ్ళుకావస్తూంది. చాలా ఖచ్చితమైన మనిషనీ, చురుకయిన ఆఫీసరనీ అతనికి మొదటి నుంచీ మంచి ఖ్యాతి ఉంది.

విశాఖపట్నం అడ్డూ ఆపూ లేకుండా ఎదుగుతూంది, ఆ ఎదుగుతో పాటు మురుగూ కుళ్ళూ కూడా అంత అడ్డూ ఆపూ లేకుండానే పెరిగి పోతున్నాయి.

అంతకుముందు ఉండే కలెక్టరు పరిపాలనలో నిర్లక్ష్యం, అన్యాయం బాగా ప్రబలినట్టు ప్రభుత్వానికి అర్జీలు వెళ్ళాయి. సంగీత ప్రియులు, సాహిత్య ప్రియులు, ఈజిల్లాని భోజరాజు ఆస్థానంలా తయారు చేశారని స్థానికంగా పెద్దలనబడే వారు ప్రభుత్వంలో పెద్దలనబడే వారికి వినతిపత్రాలు సమర్పించారు. తత్ఫలితంగాకలెక్టర్ గోపాల్ అనే (ఎం. ఏ. మేథమెటిక్స్, పి. హెచ్.డి.) ఖచ్చితమైన ఆఫీసరుని చూసి (లోగడ ఒక శాఖ డైరెక్టరు పదవిని గొప్ప సమర్థతతో నిర్వహించినందువల్ల) ప్రత్యేకంగా ఈ జిల్లా కలెక్టరుగా బదిలీ చేశారు.

"నా పరిపాలనలో ఈ జిల్లా భోజమహారాజు సంస్థానం కానివ్వను,అలా అని ఇది ఔరంగజేబు సామ్రాజ్యం కాబోదు. నాది శ్రేయోరాజ్యం"అన్నాడు ఈ జిల్లాలో తొలి ఉపన్యాసం ఇస్తూ. "నావిష్ణుః పృథివీపతిః" అన్నమాట నిజమే గాని సాక్షాత్తూ ఆ విష్ణుమూర్తి వారే వేంచేసినా ఉన్నట్టుండి విశాఖపట్నం పూర్ణా మార్కెట్ లో కూరగాయల ధరల్నిగాని, ఆ మార్కెట్ చుట్టూ పేరుకు పోయిన బురదని గాని ఏమీ చెయ్యలేకపోవచ్చు. కాని, ప్రయత్న లోపం లేకుండా, ఖచ్చితానికి, కరుకుదనానికి పేరుపడ్డ కలెక్టర్ గోపాల్, పట్టి మంచానికి పట్టిన నల్లుల్లాంటి కొందరు బురఖారాయుళ్ళని లోపల్లేపలే మాడ్చి పారేసి భళీ అనిపించుకున్నాడు. అతడు ఏ విషయాన్నిగానీ ఆలోచించి గాని నిర్ణయించడు. అనుమానించకుండా ఆర్డర్ వెయ్యడు. అనుమానించడం ద్వారా సత్యం

బయట పడుతుందనీ, అవమానం ద్వారా అహంభావం చల్లారుతుందనీ అతని సిద్ధాంతం.

దాదాపు రెండు మైళ్ళు నడిచేలోగా కలెక్టర్ గోపాల్‌కి సుమారు రెండేళ్ళ నుంచీ ఈ జిల్లాలో తాను చేసిన పనులు, ఎదుర్కొన్న సమస్యలు, అనుభవించిన సంఘర్షణలు, చక్కబరిచిన ఘర్షణలు — కొన్ని జ్ఞాపకం వచ్చాయి. జనాన్ని, క్రింద అధికారుల్ని అనుమానించి తనింకా ఆర్డర్స్ వెయ్యని కొన్ని విషయాలమీద తను ఇంకా ఎంతెంత సత్యాన్వేషణ చెయ్యాలో అదీ మనసులో కొచ్చింది. కాంప్ క్లర్కునైనా వెంట తీసుకుని రాని ఈ కాంప్‌లో తన కారుకీ, తన కారుడ్రైవరుకీ, తన ఆలోచనలకు తగిలిన 'బ్రేక్‌డౌన్' మనస్సును బాధ పెడుతూనే ఉంది. ఈ రాత్రి భీమకవి శాపం తగిలిన రాజకళింగగంగులా కరదీపిక లేకుండా నడిచి వెళ్ళి దారకొండ గుడిలో అభోజనం పడుకోవాలన్న మాట. ఆకలి తీరక పోవడం పెద్ద సమస్య కాదుగాని, తీర్చుకోలేక పోవడం వల్ల కలిగే అవమానం మాత్రం తప్పకుండా పెద్ద సమస్యే. హోదాకి భంగం రాకుండా ఈ రాత్రి గడుస్తుందా?

* * *

గుళ్ళో ఆముదపు దీపం అఖండ జ్యోతిలా వెలిగిపోతూంది.

ఎవరు కట్టించారోగాని ఈ అమ్మవారి గుడి చిత్రంగా ఉంది. అమ్మవారి మహత్తువల్లనే ఈ కొండమీద లారీలు నడుస్తున్నాయని తప్పకుండా లారీలూ, కార్లూ తోలేవాళ్ళు నమ్ముతారు. అందుచేత వాళ్ళు కొబ్బరికాయలూ, చిల్లర డబ్బులూ ట్రిప్పు ట్రిప్పుకూ ఇస్తారు. గుడి ఎదురుగా కొండ ధార ఉంది. నీళ్ళు మున్నూటరవై రోజులూ ఉంటాయి. అందుచేత అమ్మవారికి 'ధారలమ్మ' అని పేరు వచ్చిందని స్థలపురాణం తెలిసిన వాళ్ళంటారు. కొండ జనం ఆ అమ్మవారినే దార్లమ్మ దారాలమ్మ అంటారు,

కొండధార జలజలా అవిచ్ఛిన్నంగా కాలంలా ప్రవహిస్తూంది.

టైమ్ ఎనిమిదీ నలభై !

ట్రాన్సిస్టర్‌లో 'సంగీత కచ్చేరీ' వస్తూంది. గోపాల్‌కి సంగీతం అంటే అయిష్టం ఏం లేదు. కాని, అతనికది బోధపడదు. మూడేసి, నాలుగేసి గంటలు సంగీత కచేరీలకు వెళ్ళి తలకాయలు ఊపేసి పెద్ద తెలిసినట్టు తాళాలు వేసే తెచ్చికోలు దర్జాకూడా బోధపడదు. ఇవేవీ బోధపడక పోవడంవల్ల తన పరి

పాలనా దక్షతకి ఏం లోటు లేదనీ, ఆ స్థాయికి తగిన తన వ్యక్తిత్వానికీ, రసికతకీ లోటు లేదనీ అతను చాలాసార్లు తనని తాను సమర్థించుకుని, అలా సమర్థించుకోవడం మాత్రం లోపం కాదా అని తనని చూసి తనే నవ్వుకున్నాడు.

డ్రైవరు కనకయ్య! దొంగవెధవ! ఆఫీసరని తెలిసీ తననిక్కడ వదిలెయ్యడానికేమీ వెనకాడలేదు. పదిహేనేళ్ళ సర్వీసులో కాలింగ్ బెల్ వేటు దూరంలో బంట్రోతు లేకుండా పడుకోడం ఇదే ప్రథమం! జంతువుల భయం వల్ల కారు దగ్గర తప్పక ఇద్దరూ పడుకోవాలని పట్టుబట్టాడు—డ్రైవరు కనకయ్య. "తమరు కార్లో పడుకోలేరు—వద్దు కూడాను. తమరు గుళ్ళో పడుకోండి: మేం ఇద్దరం కార్లో పడుకుంటాం" అన్నాడు వినయం ఉట్టిపడే పట్టుదలతో, "నన్ను చంపేసినా నేనొక్కణ్ణీ పడుకోలేనండి, బాబూ!" అని అన్నాడు. వాడికి అన్ని మాటలు వచ్చని ఇప్పుడే తెలిసింది.

అధికారి కనకా, అధికార హోదా ఉండాలి కనకా తప్ప ఇక్కడ బంట్రోతు అవసరం అట్టే లేదు. కారణం—గుడి మాంచి పకడ్బందీగా ఉండడమే. ఒక్కడూ పడుకున్నా వచ్చిపడే ప్రమాదం ఏమీ ఉండదు. గర్భగుడి, మంటపం రెండు భాగాలు, మంటపానికి ఓపక్క గర్భగుడి. ఎదురుగుండా కటకటాలూ, రెండుపక్కలా గోడలూ, వాటికి కిటికీలూను. కటకటాల మధ్య తలుపు, తలుపుకి బ్రహ్మాండమైన గడియ. మంటపం మధ్యగా నలభై, ఏభై దీపాలు పట్టే భజన చెట్టు. దానిలో శిఖరాన అంగుళంన్నర లోతు కలిగిన ప్రమిదలో జ్యోతి. భజన చెట్టుకి వేళ్లాడగట్టి వెదురు గొట్టాంనిండా ఆముదం. ఇక్కడ వెలుతురూ, గాలీ పుష్కలంగా ఉన్నాయి. పక్కనే నిరంతరం నీరిచ్చే జల ఉంది. జంతుభయంలేదు.

మధ్యలో ఓసారి ప్రమిదలో ఆముదం పొయ్యాలేమో?

హఠాత్తుగా కలెక్టర్ గోపాల్‌కి సందేహం వచ్చింది. తాను రాకముందు నుంచీ దీపం వెలుగుతూనే ఉంది. ఎవరు వెలిగించి ఉంటారు? ఎప్పుడు? ప్రమిదలో నిండా ఆముదం ఉంది. నిన్నటి దీపం కాదు.

సందేహానికి సమాధానంలా తలుపు చప్పుడైంది.

"ఎవరది?" అనుకోకుండా కలెక్టర్ గొంతుస్థాయి పెరిగింది.

"ఓరు బాబూ, లోపల?"

లేచి ద్వారం వద్దకు నడిచి వచ్చాడు గోపాల్.

ద్వారం అవతల ఒక వృద్ధుడు నిలుచుని వున్నాడు. అతని భుజం మీద ఒక చిన్న బిడ్డ నిద్రపోతూంది.

"తలుపు తియ్యండి, బాబూ!"

మాట తీరు చూడగా ఏజన్సీ మనిషిలా లేడు.

"సో!.... నాకితను తోడన్నమాట' అనుకున్నాడు. అతను లోపలికి వచ్చేసరికి చేతిలో బిడ్డ చేతిలోఉండగానే గర్భగుడి దాకా వెళ్ళి,తలుపు తీశాడు. గుప్పుమంది కుంకంవాసన. గర్భగుడిలోంచి ఖాళీగా ఉన్న చేత్తో పక్క చుట్ట తీసుకొచ్చాడు, నేలమీద సడేసి కాలితో ఒక తాపు తన్నాడు. అది అడ్డదిడ్డంగా విడింది, బిడ్డని దానిమీద పడుకోబెట్టి, పక్కమీద ముడతలు లేకుండా సరి చేసేడు. భుజంమీద దుప్పటి కప్పేడు.

కలెక్టర్ గోపాల్ ద్వారందగ్గర నిలబడి అంతా గమనిస్తున్నాడు. ముసలాడు పక్క పరవడం అవగానే తను తలుపు గడియ పెట్టేడు. వచ్చి తన పక్కమీద కూర్చున్నాడు. ముసలాడు ఎవరు నువ్వని అడుగుతున్నాడు.

తనని ఇలా అడిగినవాడు ఇరవై ఏళ్ళలో వీడు మొదటివాడు. వీడికి జవాబు చెప్పాలా? నిజం చెప్పాలా,అబద్ధం చెప్పాలా?నేను ఈజిల్లాకి కలెక్టర్ని- తెలుసా అని అంటే నేను ఈ ప్రాంతానికి గాంధీని నన్నే ఎరగవా అని అంటా డేమో వాడు?

"ఓరు బాబూ, నువ్వు?" అని మూడోసారి అడిగాడు ముసలాడు. మళ్ళీ సమాధానంకోసం చూడకుండానే తలుపు దగ్గిరకెళ్ళాడు. తలుపు తెరిచి. బయటికి తొంగిచూసేడు. "సలికి సచ్చిపోగలవు! తిన్నావా? ఎక్కడా సోట్లేనట్టు ఇక్కడ కొచ్చినావేటి! మాకే సోటుసాలక సస్తుంటే" అన్నాడు.

తనకి విశాఖపట్నంలో ఉద్యోగమనీ, సీలేరునుంచి వస్తూ గంటన్నర క్రితం దారిలో కారు చెడిపోవడంవల్ల దిగిపోయి, ఇక్కడ బెడ్ పరచుకుని పడుకున్నాననీ, పొద్దుటే వెళ్ళిపోతాననీ అన్నాడు.

ద్వారం దగ్గిర మళ్ళీ అలికిడైంది. నెత్తిమీద పెద్ద తట్టతో ఒక ఆడ మనిషి వచ్చింది. అలికిడికి ముసిలాడు మళ్ళీ అటెళ్ళి, ఆమె నెత్తిమీద తట్ట సగందాకా దింపి ఆమె సాయంతో తట్టని గర్భగుడి దాకా తెచ్చి మూలనున్న రాయిమీద పెట్టేడు.

ఆ తట్టలో సిలవరు గిన్నెలు, గాజుగ్లాసులు, కంచాలు, రెండు మూడు

మూటలు- ఏమేమో ఉన్నాయి. వాళ్ళకున్న ఆస్తంతా ఆ తట్టలో అన్నదే అని చూసిన వాళ్ళకు స్ఫురిస్తుంది, ఆ ఆడమనిషి తన నెత్తిమీద ఇంతసేపూ ఉంచిన గుడ్డ చుట్టువిప్పి తట్టమీద జాగ్రత్తగా కప్పి, ఇటు తిరిగింది.

ఆముదం దీపం వెలుతుర్లో ఆమె ముఖం చూసి గోపాల్ ఆశ్చర్య పోయాడు. ఆమెకి ఇరవై రెండు ఇరవై మూడేళ్ళకన్నా ఉండవు, అతడికి అరవై ఉండవచ్చు. పైగా, మూడేళ్ళ బిడ్డ. ఇదేం సంసారం! ఇదేం దేశం! అనుకున్నాడు.

ఆమె నిలబడి వుంది.

గోపాల్ ఆమెవేపు మళ్ళీ చూశాడు. 'ఇరవై రెండేళ్ళుంటాయి' అనుకున్నాడు, ఆమె కేశాలు సంస్కార హీనంగా ఉన్నాయి. ఆ కొప్పు నిన్న ముడిచిందే అయినా, కొప్పులో తురిమిన కొండ పువ్వు ఈ వేళదే. పడుచుదనం పరువంలో ముడిచిన పొగరుబోతు తనంలా మెరిసిపోతుందా ఎరుపు. ఆమె జాకెట్టు తొడుక్కోలేదు. ఆ లేమి ఆ సన్నివేశాన్ని ఒక విధమైన సహజత్వంతో నింపింది.

ఆమె కలెక్టర్ గోపాల్ వేపు చూసింది. ఆమెకి తనెలా కనపడుతున్నాడో చూసుకోవడాని కన్నట్టుగా తనచుట్టూ తను చూసుకున్నాడు. అట్టే విశాలంగా లేని ఆ గుడి మంటపంలో పడమటివేపు సగంమేర అతను ఆక్రమించుకొని ఉన్నాడు. అతని బట్టలూ, పక్కమీద దుప్పటీ తెల్లగా మెరిసిపోతున్నాయి. గుప్తంగా ఉండిపోయినా అధికారం తెచ్చిన ఠీవితో అతను కలెక్టర్లా వెలిగిపోతున్నాడు. ఈ చోటంతా నాది. ఇటెవ్వరూ రాకండి, వస్తే దురాక్రమణ కాగలదు అన్న ధోరణి శిలాశాసనం చేసినట్టు అతని చుట్టూ వ్యాపించింది.

"నిలుచుంటావేం, పక్క దెచ్చుకో" అన్నాడు ముసిలాడు.

మోచెయ్యి ఆడించి, 'అతనున్నాడు. ఎలాగ?' అని సూచించింది ఆమె.

ముసిలాడు ఇటు చూసి. "బాబూ, తమరు కొంచెం అటు కాసి సరకాయించుకోరా?" అన్నాడు.

మూడు పక్కలు వేయడానికి వీలుగా గోపాల్ తన పక్కని గోడ అంచుకి లాక్కున్నాడు. గోడ దగ్గిర ఏమైనా పురుగులు, కీటకాలు ఉంటాయేమోనని క్షణకాలం అతనికి భయం వేసింది.

అయినా అతను సర్దుకున్నాడు.

* * *

"ఇలా క్కాలిపోయింది బాబూ, దీని బతుకు! అది మొగుడుండీ లేనిదైంది నాను కొడుకుండీ లేనోణ్ణైనాను— ఆడేటో, ఆడుద్దోగవేఁటో నాకు తెల్దు! నాలుగు నెల్లకోపాలి తొంగిసూస్తే సూసినట్టు, సూడకుంటే లేనట్టు. నా పేణాలు తోడేస్తున్నాడు. నా బతుకేదో నేను బతుకుతాన్రా, ఎదవ సచ్చినోడా, గుంట దాన్ని రడిసెయ్యక నీతో టొట్టికెలిపోయి టవున్లో కాపరఁవెట్రా అని నెత్తీ నోరూ మొత్తుకుంటానండి. బాబూ, నా మాటంటే ఆడి కిలువు లేదు. సీపురు ముల్లులా తీసేత్తాడు. నానంటే కిట్టకపోతేపోనాది. నానిమీదెందుకో ఆడికంతపగ? తల్లి సచ్చిపోయిన గుంటని, మూణ్ణెల్ల పసిగుడ్డుని ఈ సేతుల్తో సాకేను, బాబూ. దీని శాకిరీకోసం, మందులకోసం నా యాడది నానా సంకలు నాకి కడకి మంచం పట్టి చచ్చిపోనాదండి. నరసీపట్నం ఆస్పత్రిలో మా యాడది సచ్చిపోయేటయిములో అక్కడున్న మంతరసానమ్మ ఈ పిల్ల ముండని తను పెంచుతానని ఉంచేసుకున్నాది. బాబయ్యా. సుక్కురారం సంతకి నాను అడవి కర్రొట్టికెత్తే ఆ యమ్మ బిడ్డ నెత్తుకుని కూరా నారా జేసుకోనాని కొచ్చేదండి. ఏడాత్తిరిగే లోపల నాను సెమటోడిచి కర్రముక్క లమ్ముకున్న డబ్బులూ, అప్పుడూ అప్పుడూ దాసుకున్న సొమ్ములూ ఆరగొట్టేసిందండి దొంగ నంజ. ఎప్పుడొచ్చినా గుంటకి అంతకాయిలా సేసింది, ఇంత కర్సెట్టీసినానని నాకాడ డబ్బులు గుంజేసేది, బాబయ్యా, ఆ శంకినీ, అదుగో, దానిమీద కోపఁవంతా దీనిమీద సూపిత్తాడండి మా గుంటడు.... ఈడి కప్పుడుకి పన్నెండేల్లవుతాయండి, బాబూ. తెలిసీ తెలీని గేనం. ఈ గుంట పుట్టిన కాణ్నుంచే మా రోజులిలా సీకట్రాత్తుర్లయిపోనాయని ఆడివోదన. రైల్వేలో కలాసీ కేటొస్తాది; నాకు సంసారంవోఁటి తక్కువొచ్చి నాదా అని సీదరించుకుంటాడు, బాబో! పేదోడికి పెల్లాఁవేఁ బార్యరా, నంజికొడకా. ముసిలాణ్టి, నాకీ వొయిసులో ఈలంపట వేంట్రా, వీ పెల్లాన్ని నువు తీసుకెల్రా, ఎదవనాయాలా, నే నీ కొండమీద సితుకులు పోగుజేసుకోని, ఈ గుళ్లో దీపఁ వెట్టుకోని బతుకుతానని చెప్తే ఇందండి" అని ముసిలాడు తన కధంతా చెప్పుకొచ్చేడు.

హఠాత్తుగా ఆపి, "బాబూ, తమరు పొద్దోయినకాణ్ణించీ ఇక్కడే ఉన్నారుగదా ఏమైనా ఇంత తిన్నారా?" అన్నాడు.

ముసలాడి కధంతా వింటూ కొన్ని క్షణాలకాలంపాటు మారువేషంలో ప్రజల యోగక్షేమాలు విచారించే విక్రమార్కుడి ధోరణిలో పడ్డాడు కలెక్టర్

గోపాల్. ముసిలాడి కొడుకు గుణగుణాల్ని బట్టీ, వాడి మనస్తత్వాన్నిబట్టీ వాడి రూపాన్ని ఊహించుకొంటున్న గోపాల్‌కి, ఏదైనా తిన్నావా అన్న ప్రశ్నలలో ఆకలి, దాన్ని తీర్చుకోవడానికి అయిష్టమూ కలియనట్టై, దానిలోంచేమీ జవాబు రాలేదు.

"ఎంత పనైపోనాది. బాబో!" అని ముసిలాడు నెత్తి కొట్టుకుని, వెంటనే మూలకి పరుగెట్టికెళ్ళి దట్టలోంచి ఓ న్యూస్ పేపర్ పొట్లాం తీసేడు. అదితెచ్చి గోపాల్ ఎదుట పెట్టి, మళ్ళీ తట్ట దగ్గిరకెళ్ళి ఓ సిలవర్ గిన్నే, ఓ గాజుగ్లాసూ తెచ్చేడు. గబగబా కటకటాల తలుపు తీసుకుని నాలుగు మెట్లు దిగి జలలోంచి నీళ్ళు తెచ్చేడు.

పొట్లాం విప్పి ఉంది. దానిలో ఏముందో తెలియకుండా, ముడిచిన కాగితం అడ్డువచ్చింది. అందులో నిన్నటి సంతలో తెచ్చిన పకోడీలో, జంతికలో, నూనె మిఠాయో ఉంటుందని, ఆకలిబాధ తట్టుకోగలిగినా ముసిలాడి బాధ తట్టుకోలేక అవేమైనా తినవలసి వస్తుందని భయపడ్డాడు గోపాల్.

ముసిలాడు స్వతంత్రంగా ముందు కూర్చుని పొట్లం పూర్తిగా విప్పాడు ....అందులోంచి ప్లాస్టిక్ సంచులలో సీల్ చేసిన బన్‌రొట్టెలు బయటికి దొర్లాయి.

ముసిలాడు ఏదో హఠాత్తుగా గుర్తొచ్చిన వాడిలా మళ్ళీ లేచి తట్ట దగ్గిర కెళ్ళాడు. తట్టలో సామానులు కలకల, గణగణ తిరగేసి అందులోంచి ఒకసీసా తీసేడు. చప్పుడుకి ఆమె లేచింది.

"గుంట నెగిసిందా!" అంది.

"నేదు. నువ్వు తొంగోయే" అన్నాడు ముసిలాడు.

"పాలెందుకు!" అందామె, కూర్చుని, చీరతో ఒళ్ళు కప్పుకుంటూ.

కలెక్టర్ గోపాల్ గ్రహించాడు. ఆ సీసాలో పాలు ఆ పాపవి. నిద్దట్లో లేస్తె పట్టటానికి దాచేరు....ఆ ఆదరాన్ని తనవేపు తిప్పుకోడానికి ఏ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేటుకి పవర్సులేవు....ఇంక తాను స్వీకరించగలిగేవి ఆ బన్ రొట్టెలు మాత్రం!

0 0 0

"నీ పేరేమిటన్నావు?" అన్నాడు కలెక్టర్ గోపాల్.

"నారాయుడండి."

"నారాయుడూ, నీకొడుకు—నిన్నూ నీ కోడల్నీ తీసుకెళ్ళాలంటే వాడికి ఏమి ఉండాలి?"

"ఆడికా, బాబూ? ఏటుండాల, బుద్దీ గేనం ఉండాల:"

అసామాన్యమైన ఉల్లాసం కలిగింది ఆ మాటకి, కలెక్టర్ గోపాల్‌కి.

"ఆ ఉద్యోగం మానేసి వ్యవసాయం చేసుకోమన్నాడూ మీ వాణ్ణి?"

"ఎవసాయానికి మాకు బూఁవెఁక్కడిది, బాబూ! పరాసికాలాడతన్నారు. ఆ డక్కడ, మాఁవిక్కడ. ఎవసాయఁవూఁ నేదు, ఏ సాయఁవూఁ నేదు"

"భూఁవుంటే వ్యవసాయం చేస్తాడా?"

"ఎందుకు సెయ్యడు బాబూ? సేస్తాడు. ఆడు సెయ్యకపోతే, నానే సేస్తాను, ఆణ్ణీ, దాన్నీ ఇంటికాడ కూకోబెట్టి సెయ్యగల సత్తువుంది, బాబూ. తమలాంటి పెభువుల దయవల్ల."

"మరి భూమికోసం ధరఖాస్తు పెట్టలేక పోయావా? భూమి లేనివాళ్ళకి బంజర్లు ఇస్తారుకదా" అని సన్నగా అతని కళ్ళల్లోకి చూసేడు గోపాల్.

తఁవఁరికి తెలీందేంటుంది, బాబయ్యా? భూఁవిఁలేనోళ్ళకి బూఁవిస్తారని మూడేల్ల నాడు నా సేత కాయితాల మీద ఏలిముద్దర్లేయించుకున్నారండి, ఆరుసుట్లు సింతపల్లి తాలూకాఫీసు కెళ్ళి దొరలకి దండాలు పెట్టుకున్నాం. కాయితాలు రాపించుకున్నాం. కాయితాలు "సదివించుకున్నాం" కూడా నండి. బాబూ.... ఆ బాధలన్నీ గేపకం సెయ్యకండి, బాబయ్యా."

"నాకు తెలిసిన వాళ్ళున్నారు, చెప్పి నీకు భూమిప్పిస్తాను. కాయితం పెట్టు."

* * *

నారాయుడికి భూమి ఇచ్చే అదృష్టం చింతపల్లి తాసిల్దారును వరించ లేదు.

ఆ కాగితం భద్రంగా విశాఖపట్నానికి తీసుకు వచ్చిన కలెక్టర్ గోపాల్ దానిమీద అందమైన స్వదస్తూరీతో విశాఖపట్నం తాసిల్దారుకే ఆజ్ఞలు జారీచేసి ముద్ర ప్రసాదించేడు.

కాంపు గుమాస్తాని పిలిచి ఈ కాగితం సంగతి ఎక్కడైనా నోట్ చేసుకుని, వారం రోజుల తరవాత ఓసారీ, పదిదినాలయ్యాక రెండోసారీ పన్నెండు రోజులూ పూర్తయ్యాక ఆఖరుసారీ తాసిల్దారుకు టెలిఫోన్ మీద గుర్తుచేయమన్నాడు.

పదమూడో రోజయ్యే సరికి నారాయుడుకి విశాఖపట్నం తాలూకాలో అయిదెకరాల భూమికి పట్టా ఇవ్వడం జరక్కపోతే దానికి బాధ్యులెవరో కనుక్కోవడం వరకే కాంపు గుమస్తాగారి పూచీ. వాళ్ళకు కలెక్టర్‌గారి దర్శనం అయాచితంగా దొరుకుతుంది.

ఆ పైన రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదవ ఎలాగా ఉండదు.

0 0 0

ఏడాది తరవాత—కలెక్టర్‌గారి కారు డ్రైవరు మద్దిలపాలెంలో ఇల్లు కట్టుకున్నాడు. గృహప్రవేశానికి ఎవర్ని పిలిచినా వస్తామన్న వాళ్ళు, వచ్చేవాళ్ళే—కాని, ఎందర్ని పిలిచినా అతనికి తృప్తికాలేదు. ఇరవైఏళ్ళబట్టీ కలెక్టరుగారి డ్రైవరుని కదా. ఒక్క కలెక్టరుకూడా నీ యింటికి రాలేదే అని ఏదో బాధ పీకింది. సమయం మించిపోకుండా పనులు చేసుకొనే సమర్థుడు కనక సమయానికి తగు మాటలాడి ఆహ్వానం, అభ్యర్థన అందజేసేడు. పీడిత ప్రజల అభివృద్ధికి; సన్నకారు రైతుల సౌభాగ్యానికి పరవశించే కలెక్టర్ అతని ఇంటిని పావనం చేసేడు,

పదిమంది మధ్య గర్వంగా నిలబడి ఉపన్యాసం చెప్పేడు కలెక్టర్.

"కనకయ్య మంచి డ్రైవరు. కాని, కనకయ్యకి ఒక్కసారే బ్రేక్‌డౌన్ నేనెరిగి నంతవరకూ—అంతేకదూ!" అన్నాడు కలెక్టర్ గోపాల్.

ఒక్క క్షణానికి తెలివి తెచ్చుకుని రెండు చేతులూ జోడించి "చాలు, మా ప్రభో. తమరు నన్ను కాపాడేరు. రెండోసారి బ్రేక్‌డౌన్ వద్దు" అన్నాడు కనకయ్య.

0 0 0

అనగనగా ఒక డ్రైవరు.

ఆ డ్రైవరు పేరు కనకయ్య.

నాలుగేళ్ళ కిందట ఓసారి విశాఖపట్నం కలెక్టర్‌కి అతనిమీద ఎందుకో ఆగ్రహంవచ్చి అతణ్ని నరసీపట్నం సబ్‌కలెక్టరు దగ్గిర పనిచెయ్యమని ట్రాన్స్‌ఫర్ చేసేడు.

ఆర్డరు అమలు జరక్కుండా కనకయ్య సెలవు పెట్టేడు.

సీలేరులో అప్పుడే పని ప్రారంభించారు. గవర్నమెంటు ఉద్యోగంలో ఉంటున్న కనకయ్య సెలవుకాలం వృథాకాకుండా, ప్రాజెక్టుకి సామానులు చేర

వేసేందుకు టెండరు పొందిన ఒక కాంట్రాక్టర్ దగ్గర లారీ తోలడానికి కుదుడు కున్నాడు. కాలక్షేపంకోసం చేసే ఉద్యోగకాలంలో కాలక్షేపం కావడంకోసం చింతపల్లినుంచి నారాయుడు కూతుర్ని సీలేరు లేవదీసుకు పోయాడు. నాలుగు నెలలపాటు రెండో జీతం సుఖం, రెండో పెళ్ళాం రుచీ దొరికాయి.

రెండో ఉద్యోగం వదిలిపోయే ముందు రెండో పెళ్ళాన్ని వదిలించు కోవడం కోసం దాన్ని తనతోటి డ్రైవర్లు కొందరికీ, కాంట్రాక్టర్ మేస్త్రీలకీ, ఇంకా తనకి దండాలు పెట్టి నాటుమందు కొట్టించిన వాళ్ళకీ పరిచయం చేసే సేడు, రోజు రోజుకూ పెరిగిపోతున్న బాధ భరించలేక, కనకయ్య రెండో పెళ్ళాం లబోదిబోమని మొత్తుకుని చింతపల్లి వెళ్ళి అప్పటిదాకా తనెక్కడుందో తెలియక కొట్టుకు వస్తున్న తండ్రిని సీలేరు తీసుకొచ్చి తగాదా పెట్టింది.

ధారాలమ్మ గుడిదగ్గిర కొబ్బరికాయకొట్టడం కోసం వచ్చేపోయే లారీలు, కార్లు, జీపులు, ట్రక్కులు అన్నీ ఆపుతారు. అయిదు నిమిషాలు ఆగాలనుకున్న వాళ్ళకి అరకప్పు జలలో నీళ్ళే తప్ప టీ లేదు. గుడికి కొంచెం తూర్పువేపున కొండ చదును చేయించి అక్కడ గుడిసె వేయించి టీ కొట్టు పెట్టించేడు. సంతలో దొరికే చవక మిఠాయిలూ, బన్ రొట్టెలూ, టీ అమ్ముతూ నారాయుడు కూతురు "ఒళ్ళు దాచుకోకుండా" పనిచేసి అడిగినవాడికల్లా ఆకలీ దాహం తీర్చేది. పోటీలేకుండా దాని వ్యాపారం అలా సాగింది కొన్నాళ్లు.

కూతురి బతుకు బండలు చేసేసేడని; నారాయుడు, "నీ మీద కలెక్టరు గారితో ఫిర్యాదు చేస్తా" నంటూ కనకయ్యని బెదిరిస్తూనే ఉన్నాడు, ఓర్లంజ కొడకా, ఆగరా, నీకూ నీ కూతురికీ ఐదెకరాలు భూమి రాసిస్తాను-అంటూ కనకయ్య తప్పుకొంటూనే ఉన్నాడు!

కనకయ్య వాళ్ళకి ఐదెకరాలపొలం రాసివ్వాలంటే కనకయ్యకి ముందుగా ఏ కలెక్టరో కనీసం పదెకరాలభూమికి పట్టా ఇవ్వాలి. వాడికి ఇదొక్కర్తేకాదు గదా, పెళ్ళాం!

తన చేత చక్రం తిప్పించుకున్న వాళ్ళేగాని తనకో భూచక్రం ఇచ్చి తన సమస్యకి చక్రం అడ్డేసిన కలెక్టర్లు కనపడలేదు కనకయ్యకి-గోపాల్ తప్ప!

చింతపల్లి తాలూకాలో అయిదెకరాలిస్తే ఏపాటి, ఏభై ఎకరాలిస్తే మాత్రం ఏ పాటి? అంతా కొండ, డొంక, తుప్ప! నారాయుడు చేత సమయం చూసి పెట్టించిన కాగితం మీద నారాయణమూర్తి వారి దయ పడింది. ఆ చింతపల్లి

తాసిల్దార్ మొహం ధర్మమా అని ఆ కాగితం విశాఖపట్నం తాసిల్దార్ మొహాన పడింది. కాంపు గుమాస్తాగారి ఫోన్ కాల్స్ పుణ్యమా అని ఆ ఇచ్చే ఐదెకరాలు మెట్టలోకాక, మాగాణిలోకాక రేసపు పొలంలో రోడ్డు పక్క వచ్చిపడ్డాయి.

అక్కడ ఎకరం ఇరవై వేలుంది.

బంజర్ పట్టా నారాయడు పేరన వచ్చిన నాలుగో రోజున పవర్ పట్టా తన పేర వ్రాయించుకున్నాడు కనకయ్య. భూమి మీద వెంటనే లేఔట్స్ తయారు చేయించి, "ఇచ్చట ప్లాట్లు అమ్మబడును" అని బోర్డు తగిలించాడు. బాలాజీ హౌస్ బిల్డింగ్ సొసైటీ అనే ప్రైవేటు సంస్థవారు ఆ లేఔట్ అంతా కొనుక్కున్నారు.

చింతపల్లి సమీపంలో అయిదెకరాల భూమిని నారాయడుకి కొని ఇచ్చేసేడు కనకయ్య. ఇస్తానన్న ఐదెకరాలే కాక, ఐదువందల రూపాయలు నారాయడు కూతురి చేతిలో పెట్టి నీకూ, నాకూ ఇంక ఏ విధమైన సంబంధం లేదని చెప్పేసేడు.

పెళ్ళాం పేరిట ఇరవై వేలు బాంక్ అకౌంటు, మద్దిం పొలంలో నాలుగు గదుల డాబా ఇల్లూ; అంతో ఇంతో అనుభవం పలుకుబడీ—వీటిని మించి కనకయ్య కేం మిగిలింది, పాపం!

*